క్లుప్తంగా

8 నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ధర్మకర్తలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గురుపూర్ణిమ ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరాం ప్రసాద్ తెలిపారు. మందిరం వద్ద శుక్రవారం ఉత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అగ్రహారపేట లోని సాయిబాబా మందిరంలోనూ గురుపూర్ణిమ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

10న వెంకటగిరిలో..

వెంకటగిరి (సైదాపురం): పట్టణంలోని రాజావీధిలో ఉన్న భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మార్పణం, మంగళహారతి, నారాయణసేవ సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 12న శతజయంతి ఉత్సవాల సందర్భంగా రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

శాకాంబరిగా దుర్గామల్లేశ్వరి



నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారి శుక్రవారం అభిషేకాలు జరిపి అనంతరం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. పూజ కార్యక్రమాల్లో ఉభయదాతలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అగ్నిగుండ ప్రవేశం

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో మొహరం వేడుకల్లో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీలోని తంబుగారిపాళెం, ఆరూరు, అనగొల్లపాళెం గ్రామాల్లో పీర్ల ఉత్సవాన్ని మేళతాళాల మధ్య నిర్వహించారు. వేడుకల్లో హిందూ, ముస్లింలు పాల్గొని కార్యక్రమాలను నిర్వహించారు. పీర్ల చావడి వద్ద ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు, పీర్ల ఉత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వారాహి నవరాత్రులు



అలంకరణలో వారాహి అమ్మవారు

కోట: స్థానిక సోమేశ్వరాలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. తొమ్మిదో రోజు శుక్రవారం వారాహి అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకులు నాగరాజశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాపూరమ్మకు పొంగళ్లు



పొంగళ్లు పెడుతున్న మహిళలు

రాపూరు: రాపూరు గ్రామదేవత రాపూరమ్మకు శుక్రవారం గ్రామస్తులు పొంగళ్లను సమర్పించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు. ఉదయం 9 గంటలకు మహిళలు పొంగళ్లతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. దీంతో ఆలయం భక్తులతో సందడిగా మారింది.

గొడుగు పీరు ఊరేగింపు



రాపూరులో గొడుగు పీరు ఊరేగిస్తున్న దృశ్యం

రాపూరు: మండల కేంద్రంలో పీర్ల పండుగ సందర్భంగా శుక్రవారం రాత్రి గొడుగు పీరును ఊరేగించారు. స్థానికంగా నాలుగు పీర్ల చావళ్లు ఉన్నాయి. వీటిల్లో మొదటి రోజు అన్ని చావళ్ల నుంచి గొడుగు పీరు ఊరేగిస్తారు. శనివారం రోజు పెద్ద పీర్ల చావడి వద్ద గుండం, ఆదివారం ఉదయం పీర్ల ఊరేగింపు, రాత్రికి మిగిలిన చావడిలో గుండం వేస్తారు. సోమవారం రాత్రి పీర్ల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రూ.25 కోట్ల భూ కబ్జా!



అర్ధరాత్రి భూములను చదును చేస్తున్న జేసీబీ

జాతీయ రహదారి పక్కనే ఉన్న అన్నా చెరువు భూములపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. అనుకున్న తక్షణమే రాత్రివేళ జేసీబీతో చదును చేసే పనులు చేపట్టారు. ఈ భూమి విలువ ప్రస్తుతం సుమారు.25 కోట్లు. ఈ దురాక్రమణపై అధికారులు ఫిర్యాదు చేసినా ఫలితం మాత్రం శూన్యం. ఆరులేన్ల రహదారి ఏర్పాటుతో అన్నా చెరువు భూములకు ధర అమాంతం పెరిగింది. దీంతో అధికార పార్టీ నేతలు ఆ భూములను చెరపట్టేందుకు యత్నిస్తున్నారు.

- ప్రభుత్వ స్థలాలపై అధికారపార్టీ నేతల కన్ను
- అర్ధరాత్రి వేళ జేసీబీతో భూ ఆక్రమణ పనులు
- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారి పక్కన ఆక్రమణకు గురవుతున్న అన్నా చెరువు భూములు

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను(అన్నా చెరువు) దర్జాగా కబ్జా చేస్తున్నారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 140లో సుమారు 10.45 ఎకరాల్లో అన్నా చెరువుకు సంబంధించి భూములు ఉన్నాయి. గతంలో ఈ చెరువు ఎంతో మంది రైతులకు ఆయకట్టు చెరువుగా ఉండేది. అయితే ఇందులో క్రమేపి కొంత కొంతగా ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. కొత్తగా ఆరులేన్ల జాతీయ రహదారి(71) కోసం అన్నా చెరువుకు సంబంధించి భూములు ఒక ఎకరాకు పైగా తీసుకున్నారు. అయితే రహదారి పక్కనే ఉన్న మిగతా ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. వెంటనే ఈ ప్రభుత్వ భూముల్లో రాత్రికి రాత్రే మట్టి తరలింపు చేపట్టి, జేసీబీలతో పనులు చేస్తున్నారు. చీకటి వేళలో మాత్రమే చదును చేస్తున్నారు. ఆక్రమించిన స్థలం ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.25 కోట్లకు పైగానే ఉంటుంది. ఇదే విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇదే అదనుగా కొత్తగా జాతీయ రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ముళ్ల చెట్లను తొలగిస్తూ ఆక్రమణల పరంపర కొనసాగిస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



ప్రస్తుతం కోట్లు విలువ చేసే అన్నా చెరువు ప్రభుత్వ భూములను కొంత మంది దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ఈ నెల 2వ తేదీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చాను. అయినప్పటికీ వారు పట్టించుకోలేదు. ఫలితంగా రాత్రి వేళ ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశాను.

- వి.పార్థసారథి రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, నాయుడుపేట

కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం



పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న అన్నా చెరువుకు సంబంధించిన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపడుతున్నాం. అన్నా చెరువుకు సంబంధించి మొత్తం భూముల విస్తీర్ణాన్ని సర్వేయర్లతో ఇటీవల కొలతలు వేయించాం. నిర్ధారించిన ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులను సైతం నాటిస్తున్నాం. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మాగర్ల రాజేంద్ర, తహసీల్దార్, నాయుడుపేట

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని గురుకుల విశ్వవిద్యాలయం (బాలికల) పాఠశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు స్వీకరించనున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ టి కామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ ఇంగ్లీషు, టీజీటీ సైన్స్, టీజీటీ సోషల్ స్టడీస్, పీఈటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. డీఎస్సీ 2025 నియమాల ప్రకారం, డిగ్రీ బీ.ఎడ్ సంబంధిత సబ్జెక్టులకు సంబంధించి టెట్ ఉత్తీర్ణత అయిన మహిళా అభ్యర్థులకు మాత్రమే అర్హత ఉన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు పాఠశాల పనిదినాల సమయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలియజేశారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి గూడూరు ఆధ్వర్యంలో డెమో తరగతులు నిర్వహించి తద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలియజేశారు.

తొలి ఏకాదశి వేడుకలు రేపు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. తొలి ఏకాదశి నాడు శ్రీమన్నారాయణుడు యోగ నిద్రకు ఉపక్రమించారని ప్రతీతి. అందుకు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి అంతరాలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పాల సముద్రంలో యోగ నిద్రలో ఉన్నట్లుగా శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు.

కండలేరులో 32 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో 32.326 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2080, పిన్నేరుకాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 70, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత మృతదేహంతో ఆందోళన



మృతదేహంతో రహదారిపై బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

- నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ

పెళ్లకూరు: వివాహితకు అక్రమ సంబంధం అంటకట్టి దాడి చేయడంతో, అవమానభారంతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. మహిళ శవాన్ని చూసిన బంధువులు ఆక్రోశంతో రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. బాధితుల కథనం మేరకు, మండలంలోని పునబాక తూర్పు కండ్రిగ గిరిజన కాలనీకి చెందిన అమాస దుర్గ(27) గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. దీనికి కారణం అదే ప్రాంతానికి చెందిన నీలం మస్తానమ్మ, అబ్దుల్ కలిసి దుర్గపై దాడిచేసి, వివాహేతర సంబంధం ఉన్నట్టు పుకారుచేయడమేనని బాధితులు ఆరోపించారు. ఈ క్రమంలోనే దళిత నాయకుడు యాగాని బెన్నీతో కలిసి దుర్గ భర్త అమాససాయి, బంధువులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయమై పోలీసులకు విన్నవించారు. కానీ పోలీసులు స్పందించకపోవడంతో శుక్రవారం దుర్గ కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకొని ఆందోళనకు దిగారు. దాంతో రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు సిబ్బందితో కలిసి వెళ్లి నచ్చచెప్పి ఆందోళన విరమింప చేశారు. మృతురాలి భర్త సాయి ఫిర్యాదు మేరకు నీలం మస్తానమ్మ, అబ్దుల్‌పై పోలీసులు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం రిపోర్టు అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని సీఐ సంగమేశ్వరరావు పేర్కొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

గూడూరురూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏఐటీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తీసుకువచ్చారని చెప్పారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 6న జరిగే బైక్ ర్యాలీ, 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అనంతరం సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.ప్రభాకర్, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు శ్రీనివాసులు, నారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సీవీఆర్ కుమార్, సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, సునీల్, భాస్కర్, వెంకటయ్య, నరసింహులుశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్లకు పూజలు

నాయుడుపేటటౌన్ : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం కావాలని కోరుతూ తిరుమల శ్రీవారి మెట్ల వద్ద కర్పూరాలను వెలిగిస్తూ పూజలను చేసి కాలినడకన శుక్రవారం తిరుమలకు వెళ్లినట్లు స్థానిక వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు మారంరెడ్డి సాయికుమార్ రెడ్డి తెలిపారు. నాయుడుపేట పట్టణానికి చెందిన సాయికుమార్ రెడ్డి సీఎంగా జగన్ మోహన్ రెడ్డి రావాలని, సూళ్లూరుపేట నియోజవర్గానికి సంజీవయ్య ఎమ్మెల్యేగా గెలుపొందాలని మొక్కుకున్నట్లు తెలిపారు.

విలీనం చేయొద్దంటూ వినతి

గూడూరు రూరల్ : విలీనం పేరుతో మారుమూల గ్రామాల్లోని బడులను మూసివేయడం తగదని, విద్యార్థుల తల్లిదండ్రుల విన్నపం మేరకు ఆ బడులను కొనసాగించాలని శుక్రవారం ఎంఈఓ రవీంద్రబాబుకు సీఐటీయు నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ గూడూరు డివిజన్ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య పాల్గొన్నారు.

పొలం పత్రాల పరిశీలన



పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహులు

సాక్షి ఎఫెక్ట్..

వెంకటగిరి రూరల్ : రెవెన్యూ రికార్డుల్లో పేర్ల మార్పుపై సాక్షి దినపత్రికలో 'రెవెన్యూ అధికారుల మాయాజాలం' పేరుతో కథనం ప్రచురించడంతో తహసీల్దార్ వెంకట నరసింహులు శుక్రవారం పొలాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వెంకటగిరి రూరల్ మండలంలోని పాలకొండ సత్రం గ్రామానికి చేరుకుని బాధితురాలు భాగ్యలక్ష్మి, వెంకటస్వామి దంపతులకు సంబంధించి వ్యవసాయ భూ పత్రాలను పరిశీలించారు. విచారణ అనంతరం తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. ఆర్ఐ రాజేష్ ఆయన వెంట ఉన్నారు.

పింక్ బస్సు సేవలు వినియోగించుకోండి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్: తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బంగారుపేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శివకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని సోమసానిగుంట, పాళెంకోట గ్రామాల్లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా గ్రామాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. ఈ వైద్య పరీక్షల ద్వారా మహిళలకు రొమ్ముక్యాన్సర్ నిర్ధారణ, మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణకోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, పురుషులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జీనీత, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు పద్మావతి, చైతన్య భాను, కార్యదర్శులు రూప్‌కుమార్, వెంకట్రామ, సీహెచ్‌వోలు పద్మావతి, రాశీ, ఏఎన్ఎం శోభన, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకుడి మృతికి సంతాపం



మల్లికార్జునరావు (ఫైల్)

నాయుడుపేట టౌన్: నాయుడుపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో అధ్యాపకులుగా పనిచేస్తున్న మల్లికార్జున రావు(57) మృతి పట్ల గురుకులు ప్రిన్సిపల్ సుబ్బారావుతోపాటు సహ అధ్యాపకులు, ఉపాధ్యాయులు శుక్రవారం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మల్లికారునరావు నివాసంలోనే కొద్ది రోజుల కిందట కాలు జారిపడి తీవ్రంగా గాయపడ్డారు. నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు.

రేబిస్ నివారణ టీకాలు



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న ఏడీ డాక్టర్ సురేష్

గూడూరురూరల్ : ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6వ తేదీ పెంపుడు కుక్కలు, పిల్లులకు రేబిస్ వ్యాధి రాకుండా గూడూరులోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ఉచితంగా టీకాలు వేయనున్నట్లు సహాయ సంచాలకులు బి.సురేష్ తెలిపారు. ఈ మేరకు 6వ తేదీ పాడి రైతులు, పెంపుడు కుక్కలు, పిల్లుల యజమానులకు జంతువుల నుంచి పశువులకు, మనుషుల నుంచి జంతువులకు సక్రమించు జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పిస్తామన్నారు. యజమానులు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్త సేకరణ పరిశీలన

సైదాపురం: మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపీడీఓ రవీంద్రబాబు శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రానికి తరలించి వర్మీకంపోస్టు తయారు చేసి ఆదాయ వనరులను పెంచాలని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రకు సూచించారు. ప్రజలకు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉండి సేవలను అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు నారాయణ తదితరులున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

వాకాడు: మండల కేంద్రంలోని ఎస్‌జేఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు శుక్రవారం స్వర్ణసాగరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ దామా విజయ్‌కుమార్ విద్యార్థులకు విద్యా సామగ్రితోపాటు పాఠశాల నేమ్‌బోర్డు, ఫ్యాన్ అందజేశారు.

పరిసరాల శుభ్రత అవసరం

వెంకటగిరి రూరల్: గ్రామాల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గుణశేఖర్ రెడ్డి సూచించారు. మండలంలోని యాతలూరు, కళవలపూడి, జీకేపల్లి, చిన్నపరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో ఉన్న గ్రీన్ అంబాసిడర్లు తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. అనంతరం గ్రామస్తులను అడిగి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఈయూ ధర్నా



ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

గూడూరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈయూ డిపో అధ్యక్షుడు వై.వి.నారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆర్టీసీలో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు, వివిధ కేటగిరీల్లో ఖాళీలుగా ఉన్న 10వేల పోస్టులకు అనుమతి ఇచ్చి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ డ్రైవర్లతో నడపాలని కోరారు. టిమ్స్ డ్యామేజీలపై రికవరీలను నిలుపుదల చేయాలని, డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి ఇచ్చే డీఏ పెంచాలన్నారు. పాత ఇన్సెంటివ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి



అల్లూరికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోట: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం వెంకన్నపాళెంలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన విప్లవవీరుడు అల్లూరి అని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్‌రిజ్వీ, సులోచనరాణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాల విలీనంపై నిరసన

బాలాయపల్లి (సైదాపురం) : మండలంలోని జార్లపాడు ప్రాథమిక పాఠశాల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జార్లపాడులోని పాఠశాల విద్యార్థులను సుమారు 3.5 కిలోమీటర్ల దూరంలోని పిగిలాం పాఠశాలలో విలీనం చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులు బ్యాగులు మోసుకుంటూ అంతదూరం వెళ్లి చదువుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి జార్లపాడు పాఠశాల విలీనం ఆపాలని కోరారు.



పాఠశాల ముందు నిరసనలో విద్యార్థులు, తల్లిదండ్రులు